సేవాసంస్థ?!

వసుంధర

డాక్టర్ సుబ్బారావు కారు దిగాడు. ఎదురుగానున్న భవనంలో ప్రవేశించాడు.

హాల్లోని పనివాడాయనకు నమస్కరించాడు.

"అయ్యగారున్నారా?" అన్నాడు సుబ్బారావు.

"ఉన్నారు. తమరు కూర్చోండి!" అన్నాడు పనివాడు.

సుబ్బారావు వాచీ చూసుకుంటూ కూర్చున్నాడు.

పనివాడు మేడెక్కి అయిదు నిమిషాల్లో తిరిగొచ్చి—"అయ్యగారు మేడమీద గదిలో వున్నారు. బాగా నీరసంగా ఉందిట. తమరినేమీ అనుకోకుండా పైకి రమ్మన్నారు—" అన్నాడు.

డాక్టరు సుబ్బారావు ఏమనుకున్నాడో తెలియదు కానీ మేడమీద గదిలోకి వెళ్ళాడు.

గదిలో మంచంమీద పడుకుని ఉన్నాడు జయప్రకాష్.

జయప్రకాష్ తెలుగువాడు కాదు. వ్యాపారరీత్యా ఆ ఊరొచ్చి స్థిరపడ్డాడు. రెండు దశాబ్దాల క్రితం ఆయనకు హిందీ తప్ప మరో భాష రాదు. ఇప్పుడాయన తెలుగు తప్ప మరో భాష మాట్లాడడు. ఆయన భాషలో ఇంగ్లీషు కలుస్తుందేమో కానీ హిందీ కలవదు.

"ఎలా వుంది వంట్లో?" అన్నాడు సుబ్బారావు.

"భరించలేని నీరసం—...."

సుబ్బారావు నిట్టూర్చాడు.

"డాక్టర్—నా జబ్బేమిటి—క్యాన్సరా?"

"కాదు...."

"ఎయిడ్సా?"

"కాదు...."

"మరేమిటి?"

"అదే నాకూ తెలియడంలేదు...."

జయప్రకాష్ భయంగా—"ఈనాటి వైద్య విజ్ఞానానికి కూడా నా జబ్బందదా? నేను బ్రతుకుతానా?" అన్నాడు.

సుబ్బారావు మాట మారుస్తూ — "నగరంలోని ప్రముఖ డాక్టర్లందరితోటీ చర్చించాను. మీ జబ్బు గురించి కొన్ని నిర్ణయాలకు వచ్చాం.... కానీ...." అని ఆగాడు.

"చెప్పండి డాక్టర్!" అన్నాడు జయప్రకాష్ ఆత్రుతగా.

"మీ జబ్బుకింకా పేరు పెట్టలేము. కానీ వైద్యం లేకపోలేదు మొత్తం నలుగురం డాక్టర్లు కలిసి ఓ కోర్సు నిర్ణయించాం. అది తప్పక పనిచేస్తుందని నా నమ్మకం...."

"థాంక్యూ డాక్టర్! మీరు నా విషయంలో చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. వెంటనే కోర్సు ప్రారంభించండి—" అన్నాడు జయప్రకాష్.

"నేను డబ్బుకోసం వైద్యం చేయడంలేదు. నాకు తలిదండ్రులిచ్చిన ఆస్తిపాస్తులే ఉన్నాయి— మూడు తరాలదాకా సరిపోయేలా! జబ్బులతో పోరాడాలనే నేను వైద్య వృత్తిని చేపట్టాను. మీ జబ్బు నాకో సవాలుగా తయారయింది. ఈ విషయమై నేను చాలా పుస్తకాలు చదివాను. ఫారిన్ ప్రొఫెసర్లతో కరెస్పాండెన్సు నడిపాను. ఊళ్ళోని ప్రముఖులను సంప్రదించాను. నా కృషి ఊరికే పోలేదు. ఓ దారికి వచ్చాను. ఇక వైద్యం ప్రారంభించవచ్చు. కాని...."

"ఊఁ" అన్నాడు జయప్రకాష్ ఆత్రుతగా.

"కోర్సు నిర్ణయించినా—అందులో కొంత రిస్కుంది. మీరో ప్రముఖ వ్యాపారవేత్త. మీ ప్రాణాలెంతో విలువైనవి. మీతో రిస్కు తీసుకోలేను—...."

"ఫరవాలేదు. తీస్కోండి డాక్టర్!" అన్నాడు జయప్రకాష్.

సుబ్బారావు మాట్లాడలేదు.

"నాకు మీమీద నమ్మకముంది డాక్టర్" అన్నాడు జయప్రకాష్.

"అందుకు థాంక్స్— కానీ ముందు నామీద నాకూడా నమ్మకం పెరగాలి కదా!" అన్నాడు సుబ్బారావు.

"అయితే ఏం చేయాలంటారు?" అన్నాడు జయప్రకాష్.

"మీ అదృష్టం బాగుండి రిస్కు ఫాక్టర్ తొలగి

పోయే ఉపాయం వెతుక్కుంటూ వచ్చింది. అందుకు మీ సహకారం కావాలి...." అన్నాడు సుబ్బారావు.

"నేను సహకరించనని మీకేమైనా అనుమానమా?" అన్నాడు జయప్రకాష్.

"మీ వైద్యానికి యాభై వేలు ఖర్చవుతుంది...."

జయప్రకాష్ క్షణం ఆగి—"పెద్ద మొత్తమే!" అన్నాడు.

"కానీ సరిగ్గా నెలరోజుల్లో మీ వ్యాధి పూర్తిగా నయమైపోతుంది ...."

జయప్రకాష్ మాట్లాడలేదు.

"ఈ ఖర్చులో నా ఫీజు అయిదు వేలు మాత్రమే!"

జయప్రకాష్ మాట్లాడలేదు.

"వైద్యానికి ముఖ్యం-రోగి నమ్మకం!"

"నేను మిమ్మల్ని నమ్ముతున్నాను డాక్టర్—" అన్నాడు జయప్రకాష్ చటుక్కున.

"థాంక్స్—కానీ మరో విషయం...."

"చెప్పండి—...."

"మీ వైద్యం ప్రారంభించడానికి నెలరోజులు గడువుంది. ఈలోగా మీరు మరో యాభై వేలు ఖర్చు పెట్టాలి..."

"మరో యాభై వేలా?" జయప్రకాష్ నోరావలించాడు.

"అవును. మరో యాభై వేలు—"

"ఎందుకు?"

"మీకున్నలాంటి జబ్బుతో నే బాధపడుతున్న మరో రోగికి వైద్యం చేయడానికి...."

"అంటే?"

"చెప్పాలంటే అతడు గినీ పిగ్ .... నేను కనిపెట్టిన కొత్తమందు అతడిమీద ప్రయోగిస్తాను. అందువల్ల మీ కేవిధమైన రిస్కూ ఉండకుండా పోతుంది ...."

"డాక్టర్! మీరా జబ్బులతో పోరాడ్డంకోసమే వైద్య వృత్తిని చేపట్టానన్నారు.... మీరు కొత్త కొత్త మందు కనిపెట్టారు. దాన్ని నా డబ్బుతో పరీక్షిస్తారా?"

"మరి ఆ రోగి పేదవాడు ...."

"ధనవంతులింకెవ్వరికీ ఇలాంటి జబ్బు లేదా?"

"వైద్య వృత్తిలో పరీక్షలకు పేదవాళ్ళే గినీ పిగ్స్...."

జయప్రకాష్‌కి తన తప్పు అర్థమయింది—"పోనీ కొత్త కొత్త మందు కనిపెట్టడానికి మీరు మీ డబ్బు వినియోగించలేరా?" అన్నాడు.

"నేను జబ్బులతో పోరాడేది రోగుల కోసం. రోగుల కాసక్తి లేకపోతే—జబ్బులతో పోరాడ్డం నాకు సరదా కాదు—...." అన్నాడు సుబ్బారావు.

జయప్రకాష్ మాట్లాడలేదు.

"డియర్ జయప్రకాష్! మరో డాక్టరైతే మిమ్మల్ని తప్పుదారి పట్టించి ఏదో వైద్యం చేసి ఊరుకునేవాడు. మీకు డబ్బుకు డబ్బూ ఖర్చవుతుంది, రోగం నుంచి విముక్తి లభించదు. నేను డబ్బు కోసమనే వైద్యం చేయడంలేదు. రోగాన్నర్థం చేసుకుని నిర్మూలించడం నాకెంతో తృప్తినిస్తుంది. అలాగని ఉచితంగా వైద్యం చేయలేను. మీ గురించి ఆలోచిస్తున్నాను కాబట్టే త్వరగా గినీపిగ్ నెన్నుకున్నాను. త్వరగా ఆలోచించుకుని మీ నిర్ణయం చెప్పండి—...."అన్నాడు సుబ్బారావు.

"నాకొకరోజు గడువు కావాలి. నేను భాగ్యవంతుణ్ణే కావచ్చు. వైద్యానికి రెండు మాసాల్లో లక్ష రూపాయలు ఖర్చు పెట్టాలంటే ఆలోచన అవసరం లేనంత భాగ్యవంతుణ్ని మాత్రం కాను...." అన్నాడు జయప్రకాష్.

సుబ్బారావు తన జేబులోంచి ఓ కాగితం తీసి జయప్రకాష్ కందించి—"మీ గినీపిగ్ అడ్రసిందులో ఉంది. మీరు సరైన నిర్ణయం తీసుకుంటే వెళ్ళి అతణ్ని కలుసుకుని—అతడి వైద్యానికి మీరు సాయపడుతున్నట్లు చెప్పండి...." అన్నాడు.

"నే నాలోచించుకోవాలి కదా!" అన్నాడు జయప్రకాష్.

"ఆలోచనలో ఆలస్యం చేస్తే అది మీకే ప్రమాదం. త్వరగా ఒక నిర్ణయానికి రండి...." అని వెళ్ళిపోయాడు సుబ్బారావు.

జయప్రకాష్ తన చేతిలోని కాగితం వంకే చూస్తూ ఆ అడ్రసు పదే పదే చదువుకుని నిట్టూర్చాడు.

2

జయప్రకాష్ అనారోగ్యం కారణంగా అతడి భార్య వ్యాపార వ్యవహారాలు చూసుకుంటోంది. ఆమె పేరు రీనా. పెద్దకొడుక్కి పెళ్ళయి కోడలు కాపురాని కొచ్చినప్పటికీ—రీనాను బాగా పరీక్షగా చూస్తేతప్ప—కొత్తగా పెళ్ళయిన యువతిలా కనబడుతుంది. మొదటినుంచీ వ్యాపార వ్యవహారాల్లో ఆమె భర్తకు సాయపడుతూండేది. ఆమె కారణంగానే జయప్రకాష్ ఈ నాడీ స్థాయి కెదిగాడు.

జయప్రకాష్ కిద్దరు పిల్లలు. పెద్దకొడుకు సుభాష్

కలాసా పురుషుడు. వ్యాపారమంటే అంటీ ముట్టనట్లుంటాడు. ఏదో ఉద్యోగం చేసినట్లు ఆఫీసుకు టైముకు వెళ్ళి టైముకు వచ్చేస్తూంటాడు. ఎక్కువగా సెలవులు తీసుకుంటూంటాడు. అతడి ధోరణి కనిపెట్టి—తలిదండ్రులతడికి త్వరగా పెళ్ళి చేసేశారు. అతడి భార్య దేవయాని. ఆమెకూ యింటి వ్యవహారాలు బొత్తిగా పట్టవు. దేవయాని, సుభాష్ చిలకాగోరింకల్లా సుఖంగా జీవిస్తున్నారు.

జయప్రకాష్ రెండో కొడుకు పేరు అతుల్. అతడికి వ్యాపారమంటే ఆసక్తి ఉంది కానీ తెలివి తక్కువ. తండ్రి చాటునే ఉంటూ అతడన్నీ తెలుసుకుంటున్నాడు. ఎంత నేర్చుకున్నా అతడిలో వ్యక్తిత్వం బలపడడంలేదు. ప్రతిదానికీ తల్లో, తండ్రో సలహా యివ్వాలి. ఏదో ఒక రోజున అతడే వ్యాపారాన్నభివృద్ధి చేస్తాడని తలిదండ్రుల ఆశ. అతడికిప్పుడు ఇరవైరెండేళ్ళు. బీకాం ప్యాసయ్యాడు. వ్యాపారంలో తనంతటివాడు తానని పించుకునేదాకా పెళ్ళి చేసుకోనని ప్రతిజ్ఞ పట్టాడు.

అతుల్ కారణంగానే జయప్రకాష్ అనారోగ్యంతో ఉంటే—రీనా యింటిపట్టున ఉండకుండా—అతడితో పాటు బైటకు వెళ్ళాల్సొస్తుంది. జయప్రకాష్ సేవల కోసం ఆమె ప్రత్యేకంగా యిద్దరు మనుషుల్ని కూడా నియోగించింది. కోడలి కింటి వ్యవహారాలు బొత్తిగా పట్టవని తెలిసినా—ఆమె గురించి తనూ అంతగా పట్టించుకోదు రీనా. తనకు తానై అడిగితేతప్ప బాధ్యత అప్పగించదామె ఎవరికీ.

డాక్టర్ సుబ్బారావు జయప్రకాష్‌ను కలుసుకుని మాట్లాడినప్పుడు—రీనా యింట్లో లేదు. జయప్రకాష్

ఆమె కోసం ఎదురుచూశాడు. తన వైద్యం విషయం బాధ్యత వర్జించేదాకా ఏ నిర్ణయం తీసుకోకూడదనే అతడు డాక్టర్ని గడువడిగాడు. గడువిచ్చేక కాసేపు నిద్ర పోదామనుకున్నాడాయన. కానీ యెంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. అతడి బుర్రలో మాత్రం అంతా గజిబిజిగా ఉంది.

రీనా యింటికి వచ్చి రాగానే భర్తను కలుసుకుంది.

"నీకోసమే యెదురుచూస్తున్నాను—" అన్నాడు జయప్రకాష్. ఆమెను చూసిన ఉత్సాహంలో అతడి నీరసం కూడా కాస్త తగ్గింది.

"ఏమయింది?" అంది రీనా.

జయప్రకాష్ ఆమెకు జరిగింది చెప్పాడు.

"ఇందులో ఆలోచించడాని కేముంది? వెంటనే వైద్యాని కేర్పాట్లు చేయిద్దాం. లక్షరూపాయలు మళ్ళీ సంపాదించుకోగలం కానీ...." అని ఆగింది రీనా.

"నేను లక్షరూపాయల కోసం తటపటాయించడం లేదు. డాక్టరు సుబ్బారావు సంగతి బాగా తెలుసు కాబట్టి ఆలోచనలో పడ్డాను—...." అన్నాడు జయప్రకాష్.

"సుబ్బారావుగారు మనని మోసం చేయరు. మనకు బాగా నమ్మకస్తులు ..."

"కాదనను, కానీ గినీపిగ్ విషయం నిజం కాదని నేనూహించగలను...."

"ఎందుకని?"

"అది సుబ్బారావు పద్ధతి. ఆయన మనుషుల్ని గినీపిగ్స్‌లా ఉపయోగించుకునే టైపుకాదు. నా లాంటి జబ్బుతోనే బాధపడుతున్న మరో మనిషి కాయన

వైద్యం చేస్తానన్నాడంటే—దాని అర్థం—వైద్యం మీద ఆయనకు నమ్మకముందని!" అన్నాడు జయప్రకాష్.

"అయితే ఏమంటారు?"

"తానూరికే వైద్యం చేయడు కానీ అవకాశం దొరికి నప్పుడల్లా యేదో తంత్రం పన్ని మనవంటి వారిచేత లేని వారికి వైద్యం ఖర్చులు భరించేలా చేస్తాడాయన...."

"అంటే?"

"నాకాయన కాగితంమీద రాసిచ్చిన రోగి పేరు కృష్ణమూర్తి. ఆ కృష్ణమూర్తికి వైద్యం చేస్తే తప్ప నా కాయన వైద్యం చేయడు. కృష్ణమూర్తి వైద్యం ఖర్చులన్నీ నేనే భరించాలంటున్నాడు. కృష్ణమూర్తికి వైద్యం జరిపించకపోయినా, ఆయన వైద్యం చేయకున్నా—ఫర్వాలేదు. నేను బ్రతుకుతాను. ఆ సుబ్బారావు వైద్యం సరాసరి నా మీద ప్రయోగించవచ్చును...."

"యాభై వేల కోసం మీరు మీమీద రిస్కు తీసుకుంటారా?" అంది రీనా.

"ఇందులో రిస్కేమీ ఉండదు. సుబ్బారావు సంగతి బాగా తెలిసినవాణ్ని కాబట్టి చెబుతున్నాను. కృష్ణమూర్తి గురించి మనం యాభై వేలూ ఖర్చుపెట్టడం కుదరదుగ...."

రీనా ఆలోచనలో పడి—"మీరు నిజమే చెబుతున్నారు—" అంది.

"అందుకే కృష్ణమూర్తి వైద్యం ఖర్చు తప్పించుకోవాలి...."

"మీరు సుబ్బారావుగారికి—రిస్కు తీసుకుంటానని చెప్పండి...."

"చెబితే వినడాయన. మహా మొండిమనిషి. నేను తీసుకుంటున్నానన్నా తను డబ్బు తీసుకోనంటాడు. నా ద్వారా ఓ పేదవాడికి వైద్యం జరిపించి తీరాలంటాడు...."

"అయితే ఏం చేయాలంటారు?"

"కృష్ణమూర్తికి డబ్బాశ చూపించాలి. వైద్యం చేయించుకోనందుకు డబ్బిస్తానంటే సరి. అలాంటి వాళ్ళకి ప్రాణాలకంటే డబ్బే ముఖ్యం.... అతడి ప్రాణం అయిదువేలు కాదు—అయిదువందలు కూడా విలువ చేయకపోవచ్చు—" అన్నాడు జయప్రకాష్.

రీనా తల అడ్డంగా వూపి—"మీరు చెప్పింది రెండు విధాల బాగోలేదు. ఓ రోగికి వైద్యం జరక్కుండా ఆపడం మనకు న్యాయం కాదు. అతడు మీకులాగే బాధ పడుతూంటే—వైద్యం వద్దంటాడనుకోను. ఆ తర్వాత సుబ్బారావుగారికి మనమీద అనుమానం వస్తుంది—" అంది.

"అయితే మరింకే ఉపాయమూ లేదా?"

రీనా ఆలోచిస్తూ—"కొన్ని స్వచ్ఛంద సేవాసంస్థలుంటాయి...." అంది.

"అంటే?"

"పేదవారి కంతుపట్టని జబ్బులొస్తే వైద్యసౌకర్యం కలుగజేసే స్వచ్ఛంద సేవలు కొన్ని ఉంటాయి. అలాంటి సంస్థలు కొన్నింటికి చందాలు కూడా యిచ్చాం మనం..."

"నువ్వు చెప్పింది బాగానే వుంది. కానీ యేదో ప్రయోజనం లేందే వాళ్ళందుకొప్పుకోరు...."

"నాకు తెలుసు. జబ్బు—అంతుపట్టనిదై ఉండడం

మొదటి షరతు. రెండోది—ఆ సంస్థ కిందుకల్లా బాగా ప్రచారం లభించి—చందాలు మరింతగా వసూలు కావాలి...." అంది రీనా—"రెండో విషయంలో సహకరించడానికి మనం కొంత సాయం చేయగలం.... ప్రచారమూ, చందాలూ కూడా...."

జయప్రకాష్ కళ్ళు మెరిశాయి—"అందుకు పదివేలు ఖర్చుపెట్టినా ఫరవాలేదు. ఇంకా మనకు నలభైవేలు లాభం...."

"నేను మన అతుల్‌తో మాట్లాడతాను—...." అంటూ లేచింది రీనా.

"త్వరగా తేల్చేయి. అవతల సుబ్బారావుకి నచ్చదు, ఇవతల నేనూ నీరసం భరించలేక పోతున్నాను...." అన్నాడు జయప్రకాష్.

3

"ఈ రోజుల్లో కూడా ఇలాంటివారుంటారనుకోలేదు" అంది రీనా.

"ఏమయిందీ?" అన్నాడు జయప్రకాష్.

"ఆయన పేరు వీర్రాజు. సంవత్సరం క్రితం ఆయకెంత గానో అభిమానించే బంధువు లబ్బాయి అర్ధాంతరంగా మరణించాడు. సరైన సమయానికి వైద్యసహాయం అంది ఉంటే అతడు తప్పక జీవించి ఉండేవాడు. వీర్రాజు దీనికి చలించిపోయాడు. ఆయన బాగా ఆస్తిపరుడు. ఆ అబ్బాయి పేరు రమణ. ఆ పేరిట వీర్రాజొక స్వచ్ఛంద సేవాసంస్థను స్థాపించాడు. కృష్ణమూర్తి వివరాలు విని ఆయన వెంటనే అతడి వైద్యానికి తానేర్పాట్లు చేస్తానన్నాడు. చందా అడగలేదు. ప్రచారం కోరలేదు...."

"ఆశ్చర్యంగా ఉందే?...." అన్నాడు జయ

ప్రకాష్.

"నేను మాత్రం వెంటనే ఆయనకు వెయ్యిన్నూట పదహార్లు చందాగా యిచ్చాను. అంతకు మించి చందా తీసుకోవడం సంస్థ ఆశయాలకు విరుద్ధ మన్నా డాయన ..."

"తొందరగా పని జరగాలి...."

"మన కంటే ఆయనే తొందరపడుతున్నాడు. బహుశా ఈ రోజే వ్యవహారం తేలిపోవచ్చు— ...." అంది రీనా.

"కృష్ణమూర్తి అడ్రస్సాయన కిచ్చావా?"

"ఇచ్చాను. అవసరమైతే విదేశాలు కూడా పంపి అతడికి వైద్యం జరిపిస్తానన్నా డాయన— ...." అంది రీనా.

"నన్ను కూడా ఇయనకే అప్పగిస్తే—ఇంకో యాభై వేలు మిగులాయి—" అన్నాడు జయప్రకాష్ నవ్వుతూ.

"సరే—రోగి అంతస్థు విషయంలో ఆయనకు చాలా పట్టుదల ఉంది. బొత్తిగా గతిలేనివాళ్ళకే ఆయన సాయం చేస్తాడు...."

"కృష్ణమూర్తి బొత్తిగా గతిలేనివాడా?" అన్నాడు జయప్రకాష్.

"అతడి జీతం నెలకు ఆరువందలు. భార్య, రెండేళ్ళ కూతురు ఉన్నారు. సెంటు భూమి లేదు. ఓ చిన్న గదిలో అద్దెకుంటూ నెలకు వందరూపాయ లిస్తున్నాడు. అతడి భార్య కుట్టుమిషనుమీద బట్టలు కుట్టుకుంటూ—వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా కొంత సంపాదిస్తోంది. ఇద్దరికీ అయిన వాళ్ళున్నా—కాస్త దూరంగానే ఉంటారు. ఎవరి బాధ్యతలు వారివి. ఇప్పటి జబ్బువల్ల కృష్ణమూర్తి

మునుపటిలా పని చేయలేకపోతున్నాడు. కంపెనీవారుద్యోగం తీసేస్తామని బెదిరిస్తున్నారు. వాళ్ళింట్లో అంతా బెంగ పెట్టుకున్నారు—....” అంది రీనా.

జయప్రకాష్ నిట్టూర్చి—“డబ్బున్నవాళ్ళకు అనారోగ్య మొక్కటే జబ్బు. లేనివాళ్ళకు— పేదరికం చాలా పెద్ద జబ్బు—” అన్నాడు.

4

చిన్న పెంకుటిల్లు ముందు పెద్ద కారాగింది. కార్లోంచీ దిగాడు డాక్టర్ సుబ్బారావు.

ఇంటి ముందర నలుగురు పిల్లలాడుకొంటున్నారు. సుబ్బారావును చూస్తూ వాళ్ళాట ఆపి—అతడికేసే చూస్తూండిపోయారు.

“కృష్ణమూర్తిగారుండేది యింట్లోనే కదూ?” అన్నాడు సుబ్బారావు.

“అవునండి—” అంటూ ఓ కుర్రవాడు దారి చూపించాడు.

సుబ్బారావు ముందుకు వెళ్ళి తలుపు తట్టపోయి ఆగిపోయాడు.

తలుపు చాలా బలహీనంగా తడితే పడిపోతుందా అన్నట్టుంది.

“కృష్ణమూర్తిగారూ!” అన్నాడతను.

ఆ పిలుపు అదురుగా అన్నట్టు తలుపు తెరుచుకుంది.

తలుపు కవతల—ఆ తలుపుకంటె బలహీనంగా వున్న యువతి ఉంది.

“కృష్ణమూర్తిగారింట్లో లేరు—...” అందామె.

ఆమె మాట నీరసంగా వున్నా—తీయగా వుంది.

“లోపలకు రావచ్చా?” అన్నాడు సుబ్బారావు.

ఆమె తటపటాయించింది.

"నా పేరు సుబ్బారావు. నేను డాక్టర్ని...."

ఆమె పక్కకు తప్పుకుని—"మా యింట్లో మీరు కూర్చుందుకు కుర్చీ కూడా లేదు—...." అంది. అవమానపు బాధ సణచిపెట్టుకుందుకు ప్రయత్నిస్తున్నట్లుందామె.

సుబ్బారావు లోపలకు ప్రవేశించాడు.

ఆ గదిలో ఓ బొంత నేలమీద పరిచి వుంది. దాని మీద ఓ చంటిపాప నిద్రపోతోంది.

"కృష్ణమూర్తిగారెక్కడున్నారు?" అన్నాడు సుబ్బారావు.

"ఆఫీసుకు వెళ్ళారు—"

"ఈ సమయంలోనా?"

"ఆయనకు సెలవు కావాలి. మాట్లాడ్డానికి సమయం లోనే రమ్మన్నారు!"

"సెలవెందుకు?"

"వైద్యానికి...."

"వైద్య మెవరు చేస్తారు?"

"వీర్రాజుగారని ఓ మహానుభావుడంటు ఏర్పాటు చేస్తున్నారు."

సుబ్బారావు నిట్టూర్చి—"వైద్యానికి మీ వారు నా దగ్గర కొచ్చారు. తెలుసా మీకు?" అన్నాడు.

"తెలియదు—" అందామె.

సుబ్బారావామెకు విషయం వివరించి చెప్పాడు.

కృష్ణమూర్తి అనారోగ్యంతో బాధపడుతూ-ధర్మాసుపత్రికి వెళ్ళాడు. అక్కడ డాక్టరతణ్ని పరీక్ష చేస్తున్న సమయంలో యేదో పనిమీద అక్కడే వున్న సుబ్బారా

అతణ్ణి తన నర్సింగ్ హోంకు తీసుకుని వెళ్ళి ప్రత్యేకమైన పరీక్ష చేశాడు. అతడి వైద్యానికి కొన్ని ఏర్పాట్లు కూడా చేశాడు. నిన్నటిరోజున కృష్ణమూర్తి సుబ్బారావును కలుసుకోవాల్సి ఉంది. అతడు రాలేదు. తన వైద్యానికి వేరే ఏర్పాట్లు జరుగుతున్నట్లతడు చీటీ పంపించాడు.

"ఏం జరిగిందో తెలుసుకోవాలని వచ్చాను—" అన్నాడు సుబ్బారావు.

"మూడురోజుల క్రితం వీర్రాజుగారు మా వారిని స్వయంగా కలుసుకుని డాక్టరుకి చూపించారు. ఆ డాక్టరు చాలా పరీక్షలు చేశాడు. నిన్నటిరోజు రిపోర్టు వచ్చింది. మా వారి జబ్బుకు భారతదేశంలో వైద్య సదుపాయం లేదు. విదేశాలు వెళ్ళాలి, తక్షణం వైద్యం జరక్కపోతే వారి ప్రాణాలకే ప్రమాదమట...."

"ఆ వీర్రాజుగారెవరు?"

"రమణ సేవాసంస్థ అధిపతి. పేదవారికి వైద్యసదుపాయాలేర్పాటు చేసే స్వచ్ఛంద సేవాసంస్థ వారిది...."

"వీర్రాజుగారికి మీవారెలా పరిచయమయ్యారు?"

"తెలియదు. అది బహుశా వారి అదృష్టం...."

"చూడమ్మా—నేనీ ఊళ్లో బాగా పేరున్న డాక్టర్ని. ఉచితంగా వైద్యం చేయకపోయినా డబ్బుకోసమే వైద్యమని నమ్మడంలేదు. మీ వారిని పరీక్షించాను. వారికి నేను నయం చేయగలను. సరిగ్గా నెలరోజుల్లో మీ వారు మామూలు మనిషవుతారు. మీవారి వైద్యానికి నేను స్వయంగా ఖర్చులు భరించదల్చుకున్నాను. ఇలాటి పరిస్థితుల్లో వారు వేరే వైద్యానికెందుకు వెడుతున్నారో

సాకర్యం కావడంలేదు....” అన్నాడు సుబ్బారావు.

“ఆశ్చర్యంగా ఉంది. మాబోటి పేదవారి వైద్యానికిలా పేరున్నవారు పోటీలు పడుతున్నారు!” అందామె.

సుబ్బారావుకేం చెప్పాలో అర్థంకాలేదు. ఓ క్షణం ఆగి — “వీర్రాజుగారి విషయమే నాకాశ్చర్యంగా వుంది. ఇండియాలో వైద్యానికి వీలుండగా—విదేశాలు పంపడమెందుకో?” అన్నాడు.

“వీర్రాజుగారికంటె నాకు మీ విషయమే ఆశ్చర్యంగా వుంది. వారు సేవాసంస్థ అధిపతి. ఆ సంస్థ ద్వారా ఎందరో వైద్యసహాయం పొందారు. మీరేమో పేరున్న డాక్టరు. డబ్బు రాదని తెలిసీ స్వంతఖర్చులు భరించికూడా మావారికి వైద్యం చేయాలని ఎందుకనుకుంటారు?” అందామె.

“మీవారి జబ్బు—నా సమర్థతకు సవాలు—” అన్నాడు సుబ్బారావు.

అప్పుడు కృష్ణమూర్తి భార్య అన్న మాట విని సుబ్బారావాశ్చర్యపోయాడు.

“మీ సామర్థ్యాన్ని పరీక్షించుకుందుకు మావారి ప్రాణాలతో ఆడుకుందామనుకుంటున్నారా?” అందామె.

“అలాగని ఎవరు చెప్పారు?” అన్నాడు సుబ్బారావు.

ఆమె వివరించింది.

కొత్తరకం జబ్బులు వచ్చినపుడు గొప్పవారిపైకాక పేదవారిపై వైద్యప్రయోగం చేసి ఆ ఫలితాలనుపయోగించుకుని — గొప్పవారిని ప్రమాదంనుంచి తప్పిస్తారు వైద్యులు. కృష్ణమూర్తికి వచ్చినది కొత్తరకం జబ్బు.

ఇలాంటి జబ్బుకు భారతదేశంలో వైద్యం లేనట్లే లెక్క. ఏ డాక్టరైనా స్వంత డబ్బుతో వైద్యం చేస్తానన్నాడంటే అందుకు స్వార్థపరమైన కారణముంటుందని వీర్రాజు కృష్ణమూర్తిని హెచ్చరించి తను విదేశంలో వైద్యాని కేర్పాటు చేస్తున్నానని చెప్పాడు. అందుకే సెలవు కావాలి. సెలవు వచ్చే ఏర్పాటుకూడా వీర్రాజు చేస్తానన్నాడు. ఆయనకు మంచి పలుకుబడి వుంది.

ఈ వివరాలు విన్న సుబ్బారావు ముఖంలో అలజడి కనిపించింది.

"చూడమ్మా! ఆ వీర్రాజు చెప్పింది నిజంకాదు. మీవారి జబ్బును నేను పూర్తిగా అర్థంచేసుకున్నాను. నా వైద్యం గ్యారంటీ ఫలితాలనిస్తుంది. నెలరోజుల్లో మీవారు మామూలు మనిషవుతారు. అందుకయ్యే ఖర్చు కూడా తక్కువకాదు. యాభై వేలు. అదృష్టంకొద్దీ అన్నీ కలిసొచ్చి నేను మీవారి వైద్యానికేర్పాటుచేశాను. ఈ సమయంలో పేషంటును వదులుకోవడం నాకిష్టంలేదు. ఇందువల్ల మీవారికే ఎంతో నష్టం. బాగా ఆలోచించుకోండి—" అన్నాడు సుబ్బారావు.

"మావారి వైద్యానికి మీరు యాభైవేలు ఖర్చుపెట్టడంవల్ల నాకేమి లాభం? మాకోసం మీరు పదివేలివ్వగలరా? మావారికేదైనా అయితే-నాకు జీవనోపాధి ఏర్పాటు చేయగలరా?" అందామె.

"నీ పేరేమిటమ్మా?" అన్నాడు సుబ్బారావు.

"అనసూయ—" అందామె.

"అనసూయా! నేను వైద్యుణ్ని. పిలిచి ఊరికే వైద్యం చేస్తానంటే నీకేదోలాగుంది. ఇందులో నాకు లాభముందనుకుంటే అది నీ పొరపాటు. నీ భర్త

క్షేమంకోరి చెప్పాను. వైద్యానికి తప్ప నీకు నేనేమీ డబ్బివ్వలేను. నీ జీవనోపాధి విషయంలో హామీ ఇవ్వలేను. అలాంటి హామీలన్నీ యిచ్చి యెవరైనా వైద్యం చేస్తానంటే అది నీ అదృష్టంకావచ్చు. కానీ నన్ను వదులుకోవడం నీకు దురదృష్టంకాక మానదు. నా వైద్యాన్ని కాదనడం సిద్ధాన్ని కాదనడంలాంటిది" అన్నాడు సుబ్బారావు.

అనసూయ మాట్లాడలేదు.

సుబ్బారావు వెళ్ళిపోయాడు.

5

"చాలా మంచి నిర్ణయం తీసుకున్నందుకు నిన్నభినందిస్తున్నాను...." అన్నాడు వీర్రాజు.

"మీ సాయం జీవితాంతం గుర్తుంచుకుంటాను—" అన్నాడు కృష్ణమూర్తి.

అనసూయ వారిద్దరినీ గమనిస్తోంది.

ఒక్కసారిగా తన పరిస్థితి మారినట్లే వుంది.

తమకు చిల్లర బాకీలు — ఆరేడు వందలున్నాయి. అవి తీరిపోయాయి. కుట్టుమిషను వాయిదాలింకా అరున్నాయి. అవి కట్టేయ డ్డాయి. ఇవన్నీకాక చేతిలో పదివేల రూపాయల రొక్కం.

కంపెనీ కృష్ణమూర్తికి నెలరోజుల సెలవు మంజూరు చేసింది. అతడికేమైనా అయితే అతడి స్థానంలో అనసూయకుద్యోగమివ్వడానికి అంగీకరించింది.

"మీరు దేవుడు—" అందామె వీర్రాజుతో.

"నీ భర్తకు ప్రాణంపోకాక—అప్పుడీమాట అను-" అన్నాడు వీర్రాజు.

"పోతున్న ప్రాణాన్ని దేవుడు కూడా ఆపలేడు.

ప్రతిఫలంగా మా బ్రతుకులకు అర్థం కల్పిస్తున్నారు. మీరు దేవుడే—" అన్నాడు కృష్ణమూర్తి.

వీర్రాజు నవ్వి—"దేవుడికంటె గొప్పది అదృష్టం. మహామహా చదువుకున్నవారికే విదేశయానం కుదరడం లేదు. నువ్వు కేవలం నీ జబ్బు కారణంగా ఇటలీ వెళు తున్నావు. ఇటలీ చాలా గొప్ప దేశం. ఎంతో చరిత్ర ఉన్న దేశం...." అన్నాడు.

అనసూయ కళ్ళొత్తుకుని— "వారిని మీరాశీర్వదించండి. ఆరోగ్యంతో తిరిగివస్తారు—" అంది.

"నా దీవెనలెప్పుడూ మనసులో ఉంటాయి. నేను కున్నట్లుగా అన్నీ జరుగుతాయి—" అన్నాడు వీర్రాజు.

ఆ తర్వాత వీర్రాజు, కృష్ణమూర్తి కలిసి కార్లో వెళ్ళి పోయారు.

"ఆయన్ను నేను మళ్ళీ చూడాలి. ఇవే మా ఆఖరి చూపులు కాకూడదు—" అనుకుంటూ అనసూయ భగ వంతుణ్ని ప్రార్థించుకుంది.

అప్పుడు చంటిపాప నిద్రపోతోంది.

కాసేపట్లో ఆమె దగ్గరకు మళ్ళీ డాక్టర్ సుబ్బారావు వచ్చాడు.

"వారు ఇటలీ వెళ్ళిపోయారు!" అంది అనసూయ.

"ఇటలీయా?" అన్నాడు సుబ్బారావు ఆశ్చర్యంగా.

"అవును—మీకింకా వారితో పనేమిటి?"

"మీ వారినీ ఊళ్లో పరీక్ష చేసిన డాక్టరెవరో తెలుసు కోవాలని వచ్చాను...." అన్నాడు సుబ్బారావు గంభీరంగా.

"ఎందుకు?"

"ఈ ఊళ్ళోని స్పెషలిస్టులందరూ నాకు తెలుసు.

మీ వారు వారెవర్నీ కలవలేదు. వారెవ్వర్నీ కలవకుండా అతడి జబ్బెలా పరీక్షించబడిందో నాకర్థం కావడంలేదు. అతడినిటలీ పంపాలన్న నిర్ణయానికి వచ్చిన డాక్టరెవరో తెలుసుకోవాలని నాకు చాలా కుతూహలంగా వుంది—" అన్నాడు సుబ్బారావు.

"వీర్రాజు గారినడిగితే చెప్పేవారు...."

"ఆయన్నూ కలిశాను.... చెప్పలేదు...."

"అయితే నన్నడిగి ప్రయోజనంలేదు. నాకు తెలియదు...."

"మాడమ్మా—అనసూయా! ఈ వ్యవహారమంతా నాకనుమానంగా వుంది. అసలు మీ వారు నిజంగా ఇటలీయే వెడుతున్నారా?" అన్నాడు సుబ్బారావు.

"అంటే?"

"ఇందులో ఏదైనా మోసముందని నా అనుమానం."

"మోసమెందుకుంటుంది? ఉంటే అందువల్ల ప్రయోజనమెవరికి? మా అప్పులు తీరాయి. వారి జబ్బు నయమవుతోంది. చేతిలో డబ్బాడుతోంది. ఇన్ని ఏర్పాట్లకు తగ్గ ప్రతిఫలం మా నుంచి ఎవరు మాత్రం పొందగలరు?" అంది అనసూయ.

"అదే—ఏ ప్రయోజనమూ లేకుండా ఎవరైనా ఇలా ఎందుకు సాయపడతారు?" అన్నాడు సుబ్బారావు.

"ఈ సందేహం మీకు రాకూడదు. మీరూ మాకిలాగే సాయపడాలనుకుంటున్నారు—" అంది అనసూయ.

"నా సంగతి తెలియక నువ్విలా మాట్లాడుతున్నావు. రాణించగల శిష్యుణ్ని సానబెట్టాలన్న కోరిక గురువుకు సహజం. అలాగే నమ్మకంగా రోగం నయం చేయగలనను

ఉన్నప్పుడు—రోగిని వదిలిపెట్టడం వైద్యుడికిష్టముండదు. ఇక ఖర్చు సంగతంటావా? ఇలాంటి జబ్బే ఓ భాగ్యవంతుడికి వచ్చింది. ఆయనకు రెట్టింపు చెప్పి—ఇద్దరికీ వైద్యం చేయాలనుకున్నాను. కానీ మీవారు....” అని ఆగాడు సుబ్బారావు.

“ఎవరికెలా రాసిపెట్టుంటే అలా జరుగుతుంది. మావారిపట్ల మీకున్న శ్రద్ధకు అభిమానానికి థాంక్స్-” అంది అనసూయ.

“అది సరే—” అంటూ సుబ్బారావామెకో కార్డిచ్చి “ఇది నీకెప్పుడైనా అవసరపడవచ్చు. నా దగ్గరకు రావడానికి సందేహించకు.... నీకు, నీ కుటుంబానికి నావల్ల నయ్యే సాయం నేనెప్పుడైనా చేస్తాను....” అన్నాడు.

“బహుశా ఆ అవసరముండకపోవచ్చు. అయినా కార్డుంచుకుంటాను.” అంది అనసూయ.

6

“మీరా కృష్ణమూర్తి గురించి ఎందుకంతలా ఆలోచిస్తున్నారో నాకర్థంకావడంలేదు. బెంగపడవలసింది నేను! నా గినీపిగ్ మరో దేశం వెళ్ళిపోవడంతో నేనే గినీపిగ్‌ని కావాల్సొచ్చింది....అందుకు నేను సిద్ధంగానే వున్నాను....” అన్నాడు జయప్రకాష్.

“నా బాధ అదికాదు. కృష్ణమూర్తి మోసపోతున్నారేమోనని నా భయం....” అన్నాడు సుబ్బారావు.

“ఎందుకని?”

“అతణ్ని పరీక్షించిన డాక్టరెవరో నాకు తెలియడం లేదు. నా అనుమానం అతణ్ని పరీక్షించిందసలు డాక్టరే కాదేమోనని!” అన్నాడు సుబ్బారావు.

“అదెలా సాధ్యం?” అన్నాడు జయప్రకాష్.

“నాకు తెలిసిన డాక్టరెవరూ అతణ్ని పరీక్ష చేయలేదు. నాకు తెలియని డాక్టరెవరూ అతణ్ని పరీక్ష చేయలేదు....”

“కానీ అతణ్ని ఇటలీ పంపుతున్నారుగా—....”

“సాధ్య ఈ ఇటలీ యొక్కణ్ణిం చొచ్చిందీ అని! వైద్యానికి అమెరికా వెడతారు. ఇంగ్లండు వెడతారు. ఫ్రాన్సు వెడతారు....జర్మనీ వెడతారు....”

“ఇటలీ కెందుకు వెళ్ళకూడదు?”

“వెళ్ళొచ్చు. అరుదుగా జరిగే విశేషమిది.... నేను తరచు మెడికల్ జర్నల్సు చూస్తూనే ఉంటాను. ఇలాంటి లక్షణాలున్న వ్యాధి గురించి ఎక్కడ రిఫరెన్సు రాలేదు. ఇటలీలో దీనికి ప్రత్యేకమైన వైద్యముందని అనుకోను. అదీకాక కృష్ణమూర్తిని పరీక్షించిన డాక్టరు-అతడికి రోగనిర్ణయమేం చేశాడో తెలుసుకోవాలి గదా! ఒకే లక్షణాల నిద్దరు డాక్టర్లు రెండురకాల వ్యాధులుగా నిర్ణయించవచ్చును....”

“అయితే నా వైద్యం విషయంలో మీ కనుమానముందా?”

“లేదు. నేను రోగ్ని నిర్ణయించడానికి ముందు ఎందరితోనో సంప్రదించాను. అయినప్పటికీ ఈ డాక్టర్ని కూడా సంప్రదిస్తే బాగుంటుందనిపిస్తోంది....”

జయప్రకాష్ రవంత కలవరపడ్డాడు—“వీర్రాజు గారిని నేను కలుసుకుని మాట్లాడగలను. ఆ డాక్టర్ని మీకు పరిచయం చేయమంటారా?” అన్నాడు.

“అలా చేయడం మీ కూడా యింతో మంచిది. అవసరమైతే మీరు కూడా ఇటలీ వెళ్ళొచ్చును....” అన్నాడు సుబ్బారావు.

"సరే—ఈ విషయం రీనాకు చెబుతాను—"
అన్నాడు జయప్రకాష్.

సుబ్బారావు వెళ్ళిపోయాడు.

జయప్రకాష్ భార్యకు ఫోన్ చేశాడు.

"నేను వీర్రాజు గారిని కంటాక్టు చేసి డాక్టరు గురించి ఏ విషయమూ చెబుతాను—" అంది రీనా

"త్వరగా ఆ డాక్టర్ని మన సుబ్బారావుగారికి పరిచయం చేయాలి. నా వైద్యం ఆలస్యం కాకూడదు కదా" అన్నాడు జయప్రకాష్.

ఆ తర్వాత రీనా వీర్రాజుకు ఫోన్ చేసింది విషయం విని ఆయన—"చూడమ్మా! ఆ డాక్టరు అజ్ఞాతంగా ఉండాలనుకొంటున్నాడు. అలాంటప్పుడు పేరు బయట పెట్టడం న్యాయం కాదుకదా!" అన్నాడు.

"డాక్టర్ అజ్ఞాతంగా వుండడమెందుకు?"

"ఏవో కొన్ని సెంటిమెంట్సు కారణంగా ఆయన మా సేవాసంస్థ కుచితంగా సాయపడుతున్నాడు. తానిలా పేదలకు సాయం చేస్తున్నట్లు పదిమందికీ తెలియడమాయనకిష్టంలేదు. ప్రచార మిష్టంలేని మహానుభావుడే అయ్యుండాలి. లేక తనచుట్టూ పేదలోగు లీగల్లా ముసురుతారన్న భయమైనా అయ్యుండాలి. ఇంతకీ ఆ డాక్టర్తో మీకేం పని?"

రీనా చెప్పింది.

"డాక్టరు సుబ్బారావుగారి వైద్యానికి తిరుగేముందమ్మా....మీ వా రాయనవద్ద నిక్షేపంలా వైద్యం చేయించుకోవచ్చు...."

"అయితే మీరు కృష్ణమూర్తి నిటలీ పంపుతున్నారేం? ఇక్కడే వైద్యం జరిపించొచ్చుగా...."

"పరీక్షలో తేలిందాన్నిబట్టి ఆ నిర్ణయానికొచ్చాం. ఇండియాలో అతడికి వైద్యం లేదు...."

"డాక్టరు సుబ్బారావుగారు చెప్పిన ప్రకారం కృష్ణమూర్తిదీ, మా వారిదీ ఒకే జబ్బు...."

"ఒకోసారి పెద్ద వైద్యులు కూడా పొరబడవచ్చు...."

"తను పొరబడితే తప్పు దిద్దుకుంటానని సుబ్బారావుగారంటున్నారు. అందుకే ఆ డాక్టర్ని కలుసుకోవాలని ఆయన తాపత్రయం...."

"ప్రముఖ వైద్యులు పేదల విషయంలో చేసే తప్పులు....గొప్పవారి విషయంలో చేయరు. నా కా నమ్మక ముంది...."

"డాక్టరు సుబ్బారావుగారలాంటివారు కాదు...."

"కొన్ని నియమాలకు మినహాయింపు లుండవు...."

"వీర్రాజుగారూ—అవసరమైతే మా వారిని కూడా ఇటలీ పంపాలనుకొంటున్నాం. అందుకు సుబ్బారావుగారూ అంగీకరించారు...."

"అయితే ఓ పని చేద్దాం—" అన్నాడు వీర్రాజు— "మీ వారి పరీక్ష కాగితాలూ, రిపోర్టులూ నాకు పంపండి. నేనా అజ్ఞాత వైద్యుడికవి చూపిస్తాను. ఆయన తన అభిప్రాయం చెబితే ఆ రిపోర్టు మీ కందజేస్తాను...."

రీనా కిది నచ్చింది. ఆమె అలాగే చేసింది.

ఒకే ఒక్క రోజులో అజ్ఞాత వైద్యుణ్నించి రిపోర్టు వచ్చింది. రీనా ఆ రిపోర్టును సుబ్బారావుకి చూపించింది.

సుబ్బారావా రిపోర్టు చూసి ఆశ్చర్యపోయాడు.

"మీ వారి విషయంలో ఈ అజ్ఞాత వైద్యుడు నాతో పూర్తిగా ఏకీభవించాడు—" అన్నాడు.

రీనా నిట్టూర్చి—"హమ్మయ్య—అయితే మీరిక మా వారికి వైద్యం ప్రారంభించవచ్చు—" అంది.

"నేనాలోచిస్తున్న విశేషమదికాదు. ఇంత కచ్చితంగా అజ్ఞాత వైద్యుడు నా అభిప్రాయాలతో ఏకీభవించడం—కేవలం రిపోర్టులను చూడ్డంవల్ల జరుగదు. నా అభిప్రాయం వీరరాజుకు తెలిసైనా వుండాలి. ఆ అజ్ఞాత వైద్యుడు నాకు తెలిసిన వాడైనా అయుండాలి...."

"అవన్నీ మనకెందుకు? ప్రస్తుతానికి మన సమస్య తీరిందిగా...." అంది రీనా.

"సమస్య పూర్తిగా తీరినట్లుకాదు. నాకు తెలిసి మీ వారిదీ, కృష్ణమూర్తిదీ—ఒకేలాంటి కేసు. ఈ విషయంలో నేను శ్రద్ధగా పరీక్షలు చేశాను. నా పరీక్షలో లోపముందా? కృష్ణమూర్తి జబ్బును మీవారి జబ్బునుంచి వేరుచేసే ఆ లోపమేమిటి?"

రీనాకు విసుగొచ్చింది. ఆ విసుగును కప్పిపుచ్చుకుందుకు ప్రయత్నిస్తూ "అదెప్పుడైనా తెలుసుకోవచ్చు" అంది.

డాక్టరు సుబ్బారావు తల అడ్డంగా వూపాడు—"ఒకేలాంటి రెండు కేసుల్ని పరీక్ష చేసి—రెండూ ఒకటేనని నేను రోగనిదానం చేశాను. కానీ నావల్ల ఏదో లోపం జరిగి కృష్ణమూర్తి విషయంలో నా రోగనిదానం తప్పయింది. అలాంటి తప్పే ఆ అజ్ఞాత వైద్యుడివల్ల కూడా జరిగి మీ వారి విషయంలో కూడా అతడి రోగనిదానం తప్పయితే? నేనే తప్పుచేసినపుడతడూ తప్పు చేసే అవకాశముంది. అందుకే ఆ అజ్ఞాత వైద్యుణ్ని కలుసుకోవాలనుకుంటున్నాను...."

"అది సాధ్యం కాకపోతే మా వారికి వైద్యం ప్రారం

భించరా?"

"ప్రారంభిస్తాను. కానీ రిస్కుంటుందేమోనని భయ పడుతున్నాను ..."

రీనా సుబ్బారావును జయప్రకాష్ దగ్గరకు తీసుకుని వెళ్ళి అతడి భయం గురించి వివరించింది.

"మీ వైద్య నిదానంపై నాకు నమ్మకముంది...." అన్నాడు జయప్రకాష్ అంతా విన్నాక.

"ముందే చెప్పాను మీకు. మీకు నామీదున్న నమ్మకం నాకూ నామీదుండాలని...." అన్నాడు సుబ్బారావు.

"సుబ్బారావుగారూ! మీకూ మీ వైద్యంపై అంత నమ్మకంలేదు. మీ మనసులో ఇంకేదో వుంది—" అన్నాడు జయప్రకాష్.

"చాలా కరెక్టుగా చెప్పారు...." అన్నాడు సుబ్బా రావు.

"ఏమిటి—మిమ్మల్ని బాధిస్తున్న సందేహం?"

"కృష్ణమూర్తి నిజంగా ఇటలీ వెడుతున్నాడా అని!"

"వెళ్ళకపోతే ఏం చేస్తాడు? ఇండియాలో వీరా జత ఉద్యోగం చేసుకొంటాడు?" అన్నాడు జయప్రకాష్.

"అది తెలుసుకోవాలనే నా కుతూహలం...."

"అంతవరకూ నాకు వైద్యం చేయరా?"

"చేయడానికి నాకభ్యంతరంలేదు. కానీ నాకు తృప్తిగా ఉండదు...."

రీనా సాలోచనగా—"మరోసారి వీరరాజుగారిని కంటాక్టు చేస్తాను...." అంది.

"అదే మంచిది—" అన్నాడు సుబ్బారావు.

అయితే మర్నాటికల్లా సుబ్బారావు సందేహాలు పటాపంచలైపోయాయి.

రమణ సేవాసంస్థ ద్వారా — వైద్యం గురించి కృష్ణమూర్తి ఇటలీ వెడుతున్న విశేషం వార్తగా ఫోటోలతో సహా వార్తాపత్రికల్లో వచ్చింది. ఎయిర్ పోర్టులో వీర్రాజా, కృష్ణమూర్తిల ప్రత్యేకమైన ఫోటో కూడా వచ్చింది.

డాక్టరు సుబ్బారావు జయప్రకాష్‌కు వైద్యం ప్రారంభించాడు.

7

“నెక్స్ట్!” అన్నాడు సుబ్బారావు.

లోపలకు ప్రవేశించిందో యువతి.

సుబ్బారావామెను చూసి ఆశ్చర్యపోయాడు. ఆమె అనసూయ. కృష్ణమూర్తి భార్య....

“ఏమయిందమ్మా?” అన్నాడు సుబ్బారావు.

“నేను వైద్యంకోసం రాలేదు—” అందామె.

“ఊఁ” అన్నాడు సుబ్బారావు.

ఆమె ఓ కవరు అతడి ముందుంచి—“ఇది వారు ఇటలీ నుండి వ్రాసిన ఉత్తరం—” అంది.

“అయితే?”

“మీరొకసారి చదవండి—” అంది అనసూయ.

“ఎందుకు?”

“ఒకరోజంతా వారు రోమ్ నగరంలోని విశేషాలు చూశారు. ఆ సంతోషంలో, ఉత్సాహంలో తన జబ్బు సంగతికూడా మర్చిపోయారు....”

“అయితే?”

“ఇందులోని విశేషాలు చదివితే మీకు వారు నిజంగా ఇటలీ వెళ్ళారా అన్న అనుమానం తీరిపోతుంది—....”

“చూడమ్మా — నేనితరుల ఉత్తరాలు చదవను.

అందులోనూ భర్త భార్యకు రాసేవి చూడనుకూడా చూడను. మీవారిటలీ వెళ్ళారని నేను నమ్ముతున్నాను."

"మీరీ ఉత్తరంకూడా చదవాలి— ...."

"ఎందుకు?"

"వారు నాకు వ్రాశారు — ఈ ఉత్తరం మీకు చూపించమని!"

సుబ్బారావు నొసలు చిట్లించి — "ఎందుకు?" అన్నాడు.

"మీరు తనకు చాలా సాయం చేశారట. మీకు శ్రమ తప్పించాలనే తను రమణ సేవాసంస్థద్వారా విదేశ వైద్యానికి వెళ్ళారుట. మీవల్ల ప్రయోజనం పొందక పోయినా మిమ్మల్ని చిరకాలం గుర్తుంచుకుంటామని వ్రాశారు. ఈ ఉత్తరం మీకు చూపించమని మరీ మరీ వ్రాశారు...."

కానీ—భార్యాభర్తల ఉత్తరాలు....?!" అన్నాడు సుబ్బారావు.

"డాక్టరుగారూ! ఈ ఉత్తరాన్నిలాగూ రహస్యంగా ఉంచడం కుదరదు. రమణ సేవాసంస్థ ఈ ఉత్తరానికి ఫోటో కాపీలు తీసుకున్నారు. కాబట్టి మీరు చదవ: డానికి తటపటాయించకండి...."

సుబ్బారావు మారు మాట్లాడకుండా ఉత్తరం చదివాడు.

తన ప్రయాణపుటనుభవాలు, రోమ్‌నగర విశేషాలు విపులంగా, అందంగా వివరించాడు కృష్ణమూర్తి. ఆ ఉత్తరంలో రెండేసి వాక్యాలకోసారి రమణ సేవాసంస్థను పొగిడాడు. మధ్యలో సుబ్బారావు గురించిన ప్రసక్తి కూడా వుంది.

ఈ ఉత్తరాన్ని వీర్రాజు తన సంస్థ ప్రచారానికి వాడుకుంటాడని సుబ్బారావు కర్థమయింది. కృష్ణమూర్తి వైద్యానికో యాభై వేల రూపాయలు ఖర్చయితే అతడికి వచ్చే చందాలు లక్షల్లో వుండవచ్చు. కానీ—ఒక సత్కార్యం సత్కార్యం కాకుండా పోదు.

దేశంలో సేవాసంస్థలు చాలా ఉన్నాయి.

మన జనాభా ఎక్కువ. రోగాలూ ఎక్కువే!

కానీ సేవాసంస్థలన్నీ ఒక్కటైతే — పేదలను రోగాలబారినుండి కాపాడ్డం—ప్రమాదకరమైన రోగాల కూడా ఉచిత వైద్య సౌకర్యాన్నందచేయడం— అసాధ్యం కాదు.

కానీ అలా జరగడంలేదు.

వీర్రాజు కృష్ణమూర్తి విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నాడు ఎందుకు?

“మీ వారికి నేననుకుంటున్న జబ్బొకటి .... రమణ సేవాసంస్థ డాక్టరు చెప్పిన జబ్బు వేరొకటి! ఇదొక్కటే నన్ను కలవరపరుస్తోంది తప్పితే వైద్యం గురించి మీ వారికి ఇటలీ వెళ్ళే అవకాశం కలిగించినందుకు నాకు చాలా సంతోషంగా వుందమ్మా.... కానీ నాకీ వార్త చెప్పడానికి చాలా శ్రమ తీసుకుని వచ్చావు....”

“ఇందులో శ్రమేముంది డాక్టరుగారూ! ఎంతో శ్రమ తీసుకుని వీర్రాజుగారు మావారిని వైద్యం గురించి ఇటలీ పంపారు. వారి సేవాసంస్థను మీరనుమానిస్తున్నారు. నాకు చేతనైనంతలో మీలోని అనుమానాన్ని తొలగించాలనిపించింది .”

“ఇప్పుడు నాకింకే అనుమానమూ లేదు—” అన్నాడు సుబ్బారావు. అతడి చేతిలోని కృష్ణమూర్తి ఉత్తరపు

కాగితం — ఇంపోర్టెడ్ క్వాలిటీదని చెప్పకనే తెలుపోంది. అతడిముందు బల్లమీదున్న కవరుమీద ఇటలీ దేశపు తపాలాబిళ్ళ, ముద్రకూడా వున్నాయి. అయినప్పటికీ సుబ్బారావు అనసూయను సంతృప్తిపరచేందుకే తనకే అనుమానమూ లేదని ఒప్పుకున్నాడు.

కానీ అనసూయ....ఒక్క క్షణమాగి — "నాకిప్పుడు చాలా సంతోషంగా ఉంది— ...." అంది.

"ఎందుకు?" అన్నాడు సుబ్బారావాశ్చర్యంగా.

"నేనీ ఉత్తరాన్ని మీకు చూపడానికి కారణమేమిటంటే — మా వారు నిజంగానే ఇటలీ వెళ్ళారని తెలుసుకనేందుకిది సరిపోతుందేమో తెలుసుకుందామని!" అందామె. ఆమె గొంతులో తడి వుంది.

"అంటే?"

"మీరనుమానం వెలిబుచ్చినప్పట్నించీ నాకూ భయంగా వుంది. మాకింత అదృష్టమా అని నమ్మలేక — అర్థంలేని అనుమానాలతో సతమతమవుతున్నాను. మీరిప్పుడీ మాటలన్నాక నాకు తృప్తిగా వుంది. డాక్టరుగారూ! మీరు మంచివారు. మీది మంచి మనసు. మా వారు త్వరలోనే ఆరోగ్యంగా తిరిగివస్తారని ఒక్క మాట చెప్పండి. సంతృప్తిగా వెళ్ళిపోతాను—" అంది అనసూయ.

అప్పుడామెకు ఆగకుండా ఏడుపు వచ్చింది.

సుబ్బారావామెను ఓదార్చాడు.

ఆమె వెళ్ళిపోయాక—ఓ నంబరు తిప్పి — "హలో డిటెక్టివ్ వెంకన్నగారేనా?" అన్నాడు.

"అవును— ...." అందవతల గొంతు.

సుబ్బారావు తన్నుతాను పరిచయం చేసుకుని కృష్ణ

మూర్తి విషయంలో జరిగిందంతా చెప్పి — "వీర్రాజు విషయం నాకనుమానంగా వుంది. మీరు పరిశోధించాలి. ఆయనకు కృష్ణమూర్తితో ఏర్పడిన అవసరమేమిటి? రమణ సేవాసంస్థ నమ్మతగినదేనా? ఆ సంస్థ ఇతర కార్యకలాపాలేమిటి?....వగైరాలన్నీ మీరు తెలుసుకోవాలి. మీకు నేను కోరిన ఫీజిచ్చుకుంటాను...." అన్నాడు.

"మీకు వీర్రాజుమీద అపనమ్మకమెందుకు?"

"కృష్ణమూర్తిని ఇటలీ వెళ్ళమని రికమెండు చేసిన డాక్టర్ని అజ్ఞాతంగా వుంచడం, కృష్ణమూర్తి కుటుంబానికి సదుపాయాలు చేయడం, అనుమానించే నన్ను నమ్మించడానికై — కృష్ణమూర్తి భార్యనుత్తరంతో సహా పంపడం ఇవి చాలవంటారా?"

"చాలు....కానీ ఈ కేసుమీద మీ ఆసక్తి ఏమిటి? ఇందు గురించి మీరు పరిశోధనకై డబ్బుకూడా ఖర్చు చేయాలనెందుకు అనుకుంటున్నారు?"

"ఎందుకంటే — నేను డాక్టర్ని కనుక! కృష్ణమూర్తికి నేను రోగ నిర్ధారణ చేశాను. ఇండియాలో అతడికి నేను తప్ప ఇంకెవ్వరూ వైద్యం చేయలేరని నా గట్టినమ్మకం. ఇటలీలో అతడికి సరైన వైద్యం జరుగుతుందని నా కనిపించడంలేదు. సులభంగా వైద్యం చేసే డాక్టరిక్కడుండగా — కాదని అతణ్ని ఇటలీ పంపడం — నాకెన్నో అనుమానాలను కలిగిస్తోంది. ఆ అనుమానాలను మీ పరిశోధనే తీర్చాలి...."

"అది సరే — .... కృష్ణమూర్తి కేమైతే మాత్రం మీకేం నష్టం? అంతా స్వయంకృతాపరాధమని సరిపెట్టుకుంటే మంచిది...."

“వెంకన్నగారూ! డాక్టరుగా నా బాధనర్థం చేసుకోండి. గ్యారంటీగా నేను కృష్ణమూర్తికి నయం చేయగలను. అతణ్ని ఇటలీ పంపించి వీర్రాజు పెద్ద అన్యాయం చేశాడని నా అనుమానం. కృష్ణమూర్తికక్కడగానీ యేదైనా అయితే—రమణ సేవాసంస్థ ఆశయాలెటువంటివైనా—ఎంత గొప్పవైనా—అది హత్య అవుతుంది. వృత్తికంకితమైన యే డాక్టరుకైనా—ఒక రోగిని నయంచేసే అవకాశం వదులుకోవడం బాధగానే ఉంటుంది. అదే రోగి మరో డాక్టరు చేతిలో ప్రాణాలు కోల్పోతే — అది నాబోంట్లకు భరించ శక్యంకాని విశేషం. వెంకన్నగారూ! మీరీ కేసు పరిశోధించి నిజానిజాలు తెలుసుకోండి. అంతా శుభమే జరిగి కృష్ణమూర్తి బాగుపడితే—డాక్టరుగా నేను మరిన్ని కొత్త విశేషాలు తెలుసుకోగలుగుతాను. అయితే అలా జరుగుతుందని నాకు తోచటంలేదు....” అన్నాడు సుబ్బారావు.

8

డిటెక్టివ్ వెంకన్న వెంటనే రంగంలోకి దిగాడు. అయితే అతడు తనీ కేసుతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకోలేదు. తనకు తెలిసిన వారిద్వారా వీర్రాజు గురించీ రమణ సేవాసంస్థ గురించీ వాకబు చేయించాడు.

రమణసేవాసంస్థ స్థాపించి ఏడాది కూడా కాలేదు. సంస్థద్వారా కొన్ని మంచి పనులు జరిగాయి. ప్రత్యేకించి చెప్పుకోతగ్గ విశేషం—ఇటీవల కృష్ణమూర్తిని ఇటలీ పంపడమే! ఈ సంఘటనతో సంస్థకు చాలా పేరు వచ్చింది. పదిమందికీ సంస్థ గురించి తెలిసింది. చందాలు కూడా బాగా వసూలయ్యాయి.

సంస్థ వ్యవస్థాపకుడు వీర్రాజు గతచరిత్ర అంతా మంచిది

కాదు. ఆయనకు పిల్లలులేరు. ఓ బంధువుల కుర్రాడిని పెంచుకుంటున్నాడు. భార్య రెండో పెళ్ళికి ఒప్పుకున్నా ఆయన చేసుకోలేదు.

వీర్రాజుకు సంఘవిద్రోహక శక్తులతో పరిచయమున్నట్లు దాఖలా లున్నాయి. అయితే ఏ నేరమూ ఋజువు కాలేదు. ఆయన జైలుకు వెళ్ళలేదు. ఆయనకు చిన్న చిన్న వ్యాపారాలు, కొద్దిగా భూములు వున్నాయి. కానీ ఆదాయం చాలా ఎక్కువ. అదెలా వచ్చిందీ అంటే చెప్పడం కష్టం.

ఏణ్ణర్థం క్రితం వీర్రాజు పెంపుడు కొడుకు ప్రమాదవశాత్తూ మరణించాడు. అప్పుడాయనకు విరక్తిభావం కలిగింది. కొడుకు పోయిన ఆర్నెల్లలో ఆయన సేవాసంస్థ ప్రారంభించాడు.

ఈ వివరాలన్నీ వెంకన్న రెండు రోజుల్లో సేకరించాడు. వాటినిబట్టి కృష్ణమూర్తిని ఇటలీ పంపడ మొక పెద్ద విశేషంగా అతడికి తోచలేదు.

ఏ సంస్థకైనా పేరు తెచ్చుకునేందుకు అవకాశం కావాలి. కృష్ణమూర్తి జబ్బు—రమణ సేవాసంస్థకు వచ్చిన బంగారు అవకాశం. వారది వినియోగించుకున్నారు.

ఇప్పుడు కృష్ణమూర్తి గనుక పూర్తిగా నయమై దేశానికి తిరిగివస్తే—రమణ సేవాసంస్థకు లభించే ప్రచారమింతా అంతా కాదు.

వెంకన్న అసిస్టెంట్లలో ఒకరైన రాజమ్మ—అనసూయతో స్నేహం ప్రారంభించింది. తరచుగా రాకపోకలతో—అనసూయకు తెలియకుండానే చాలా విశేషాలు సేకరిస్తూండేది. వాటిలో ఒక్కటి కూడా వెంకన్న

పరిశోధనకు పనికి వచ్చేవి కావు.

ఒక రోజున రాజమ్మ వెళ్ళేసరికి అనసూయ ఏడుస్తోంది.

"ఏం జరిగింది?" అంది రాజమ్మ ఆశ్చర్యంగా.

ఏం జరిగిందో చెప్పడానికి అనసూయకు కాసేపు పట్టింది. అది విని రాజమ్మ షాక్ తింది.

కృష్ణమూర్తికి ప్రమాదకరమైన ఆపరేషను. ఆపరేషను కభ్యంతరం లేదని ముందుగానే కృష్ణమూర్తివద్దా, అనసూయవద్దా కాగితాలు రాయించుకున్నారు.

ఆపరేషన్ జరిగింది.

కృష్ణమూర్తి చనిపోయాడు.

అనసూయ ఏడుస్తోంది.

"కబురెలా తెలిసింది?" అంది రాజమ్మ.

ఎలా తెలిసిందీ చెప్పడానికి అనసూయకు మళ్ళీ కాసేపు పట్టింది.

వీర్రాజు తను రాకుండా మనిషి ద్వారా కబురు పంపాడు.

అంతకుముందు అనసూయ చాలాసార్లు డాక్టరు సుబ్బారావు అనుమానం గురించి రాజమ్మకు చెప్పివుంది. అందుకని రాజమ్మ. "మీ వారు చనిపోయుండరు. వీర్రాజుగారేదైనా నాటకమాడుతున్నారేమో!" అంది.

"అలాంటి ఆశ లేమీ లేవు...."

"ఆశ్చర్యపడకు. వీర్రాజుకు మీ వారివల్ల నయ్యే పనేదో వుంది. ఇటలీ అన్నాడుగానీ అక్కడికి పంపి వుండడు. నీ నుంచి గొడవలేకుండా ఉండడం కోసం నీ కాస్త డబ్బిచ్చాడాయన ఇప్పుడు మీ వారు పోయారంటున్నాడు. ఇంక నువ్వేం చేయగలవు? మనం

ఏ డిటెక్టివ్ ఫుకైనా చెప్పి ఈ విషయం ఆరా తీయిద్దాం"
అంది రాజమ్మ.

"అలా ఆశపడ్డానికి లేదు. ఇటలీ నుంచి వారి శవం రేపు ఇండియాకు చేరుకుంటుంది" అంది అనసూయ.

"శవమా?"

"అవును. దహన సంస్కారాలిక్కడే జరగాలి కదా! వీర్రాజుగారు శవాన్నిక్కడకు రప్పిస్తున్నారు" అంటూ భోరున ఏడ్చింది అనసూయ.

రాజమ్మ ఇంకేమీ మాట్లాడలేదు.

9

పేపర్లో రమణ సేవాసంస్థ గురించి మొదటి పేజీలో వచ్చింది.

ఒక సామాన్యుడిని సామాన్య రోగం నుంచి కాపాడ్డానికి—ఇటలీలో ఆపరేషన్ ఏర్పాట్లు చేయించడమే ఒక పెద్ద విశేషం! ఆ ఆపరేషన్ ఫెయిలై అతడు చనిపోతే ఆ శవాన్ని వెనక్కి రప్పించి—అయినవారికప్పగించటం—ఇంకా పెద్ద విశేషం...

శవం కంటె ముందు వార్త వచ్చింది.

సామాన్యుడి ప్రాణాలకే కాదు—శవానికి కూడా ప్రాముఖ్యత నిచ్చిన సంస్థ రమణ సేవాసంస్థ. మధ్య తరగతి సెంటిమెంట్లకు విలువ నిచ్చిన సంస్థ రమణ సేవా సంస్థ....

ఆ రోజు దినపత్రికల్లో మొదటి పేజీల్లో వీర్రాజు ఫోటోని చాలామంది ఉదయం లేచీలేవగానే చూశారు.

ఆ రోజు మధ్యాహ్నానికల్లా అనసూయ శవాన్ని రిసీవ్ చేసుకుంది. అందుకోసం చాలమంది ప్రత్యేకంగా హైదరాబాదు తీసుకుని వెళ్లాడు వీర్రాజు.

ఒక కారులో అనసూయ, ఆమె ఒడిలో చంటిపాప, పక్కనే భర్త శవం....

శవం వాసన వేయకుండా ఐసులో పెట్టబడింది.

ముందు వీర్రాజు, డ్రయివరు.

కారు హైదరాబాదు వదిలిపెట్టింది.

ఆ కారును కాస్త దూరంగా వెంబడిస్తోంది ఓ పోలీసు జీపు.

వీర్రాజు జీపును గమనిస్తున్నాడు.

అయనా జీపును ఎయిర్‌పోర్టు వద్ద చూశాడు. తన కారు బయల్దేరాక కూడా చూశాడు.

ఇప్పుడాయనకిక సందేహం లేదు—ఆ జీపు తమనూ వెంబడిస్తోంది!

"డ్రయివర్ కారాపు" అన్నాడు వీర్రాజు.

కారాగింది.

వీర్రాజు కారు దిగి పోలీసు జీపు దగ్గరకు రాగానే తనూ ఆపి "మీ రెక్కడిదాకా ప్రయాణం?" అనడిగాడు.

"విజయవాడ" అని సమాధానం వచ్చింది.

"అలాగా" అన్నాడు వీర్రాజు.

"మీ రెక్కడిదాకా?" జీపులోని పోలీసు అడిగాడు.

"విజయవాడే!" అని అబద్ధమాడాడు వీర్రాజు.

"మాతో మీకేమైనా పనుందా?" జీపులోని పోలీసు అడిగాడు.

"నేనూ మిమ్మల్నదే అడుగుదామనుకుంటున్నాను...."

"అంటే?"

"హైదరాబాదు ఎయిర్‌పోర్టు నుంచీ మీరు నా వెంబడే వస్తున్నారు. నాతో ఏదైనా పనుందేమోనని

అనుమానం వచ్చింది" అన్నాడు వీర్రాజు.

"అనుమానించదగ్గ తప్పేదైనా చేశారా మీరు?"

"చేశాను" అన్నాడు వీర్రాజు.

"ఏమిటది?"

"ఒక సామాన్యుడి శవాన్ని దహన సంస్కారార్థం ఇటలీ నుంచి రప్పించి ఇండియాలోని అతడి భార్యకప్పగించాను."

"ఓహ్-మీరు వీర్రాజుగారు కదూ! మీ ఫోటో ఈ రోజు పేపర్లో ఇదయమే చూశాను. క్షమించాలి సార్!" అన్నాడు పోలీసు.

"మేము మీ వెనకాలే వస్తే మీకు రక్షణ కూడా! ఇందులో తప్పేముంది?" అన్నాడింకో పోలీసు.

"మీకేదైనా అనుమానముంటే వెంటనే నా కారు చెక్ చేయండి. కానీ ఇలా వెంబడి వస్తూంటే చూసే వాళ్ళు కేదోలా గుంటుంది. నాకూ బాగుండదు" అన్నాడు వీర్రాజు.

"మీవంటి వారిని శంకించి చెక్ చేసే నీతి? మా పోలీసు శాఖ ఇంకా దిగజారిపోలేదు సార్....మీ మనసు కష్టపెడితే అయాం సారీ" అన్నాడా పోలీసు.

పోలీసు జీపు ముందుకు వెళ్ళిపోయింది.

వీర్రాజు జరిగింది అనసూయకు చెప్పాడు.

అనసూయ కాయన చెప్పింది బుర్ర కెక్కలేదు. ఆమె కంతా అయోమయంగా వుంది. భర్త శవం ఆమె దుఃఖాన్ని పెంచుతోంది.

కారు బయల్దేరింది.

ఆ వెనుకే కాస్త దూరంలో వెంకన్న కారు వస్తోంది. ఆ కారు గురించి వీర్రాజంతగా పట్టించుకోలేదు. ఎందు

కంటే వెంకన్నప్పుడు మారువేషంలో వున్నాడు. ఆ కారతడి స్వంతం కాదు.

పోలీసుజీపు దగ్గర జరిగిన సంభాషణ వాకీటాకీ సాయంతో వెంకన్న విన్నాడు.

నిజానికి ఆ పోలీసులు నిజం పోలీసులు కారు. వేషధారులు....

వెంకన్న వారిని నియోగించాడు.

వీర్రాజు ప్రవర్తనలో అనుమానించతగ్గ విశేషాలుంటే కారంతా సోదా చేయించాలనుకున్నాడు, కానీ వీర్రాజు సోదా గురించి తనే ఆఫర్ చేశాడు. నిజాయితీగల పెద్ద మనిషిలా ప్రవర్తించాడు. సోదా చేయడంవల్ల పోలీసు డిపార్టుమెంటుకు చెడ్డ పేరొస్తుంది.

డాక్టరు సుబ్బారావు అనుమానం నిరాధారమైనది కావచ్చు.

కాసేపటి తర్వాత వెంకన్న వీర్రాజు కారుని దాటి ముందుకు వెళ్ళిపోయాడు.

అతడి వెనుకే ఇంకో కారుంది. అదీ వీర్రాజు కారు ననుసరిస్తోంది. అందులోనూ వెంకన్న నియోగించిన మనుషులున్నారు. వారు వీలుచూసుకుని కారు నటకాయించి దోచుకునేందుకు ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నంలో కారంతా సోదా చేస్తారు—శవంతో సహా! తర్వాత వీర్రాజు గొప్పతనం తెలుసుకుని అతడికి నమస్కరించి తప్పును క్షమించమని వెళ్ళిపోతారు. ఇదీ వెంకన్న ప్లాను.

కానీ ఈ పథకం జయప్రదం కాలేదు.

వెంకన్న మనుషులు కారు నటకాయించగానే ఎక్కణ్ణించో నలుగురు మనుషులు వచ్చి వాళ్ళను తన్ని

పంపించారు.

ఈ విషయం వెంకన్నకు చాలా ఆశ్చర్యం కలిగించింది.

వాళ్ళెక్కణ్ణుంచి వచ్చారు? ఎలా వచ్చారు?

వీర్రాజు దారి పొడుగునా తనకు రక్షణ ఏర్పాటు చేసుకున్నాడా?

అంటే అతడు నిజంగా నేరస్థుడా?

10

కృష్ణమూర్తి శవం స్మశానంలో కాలి బూడిదయింది.

పురప్రముఖులెందరో వచ్చి ఆ దృశ్యం చూశారు.

వారిలో వెంకన్న, డాక్టర్ సుబ్బారావు కూడా వున్నారు.

పోలీసాఫీసర్లు కొందరా దృశ్యాన్ని చూడ్డానికొచ్చారు.

ఉన్నట్లుండి ఒక వ్యక్తి తన జేబులోంచి పర్సును తీసి బూడిదలోకి విసిరాడు.

"ఏమిటిది?" అన్నారెవరో.

"అరే—చందనపు పొడి పొట్లాన్ని విసురుదామనుకుని పర్సును విసిరేశాను. వెళ్ళి తెచ్చుకుంటాను...." అన్నాడా వ్యక్తి. అతడు బూడిద వైపు నడుస్తుండగా "ఆగు ఎముకలేరుకునేదాకా ఆ బూడిదను తాకడానికి లేదు" అన్నాడు వీర్రాజు.

"నా పర్సులో ఆరువందలున్నాయి. తర్వాత అవి పోతే?" అన్నాడా వ్యక్తి.

"పోతే ఆ డబ్బు నేనిస్తాను. ఇంత వ్యవహారం నడిపించి చివర్లో సెంటిమెంటు పాడుచేయడం నా కిష్టం లేదు" అన్నాడు వీర్రాజు.

ఆ వ్యక్తి ఊరుకున్నాడు.

అప్పుడు వెంకన్న ముందుకు వచ్చి "అందరూ నన్ను మన్నించాలి. ఇప్పుడు బూడిదలోనికి విసరబడ్డ పర్సులో స్మగుల్డు వజ్రాలున్నాయి. వాటి విలువ పాతిక లక్షలుంటుంది. నేనీ వ్యక్తిని చాలా సేపట్నించి గమనిస్తున్నాను అతడు వాడు భయపడి తాత్కాలికంగా వాటి నక్కడ దాచుకున్నాడు" అన్నాడు.

అక్కడున్న పోలీసాఫీసర్లలో చలనం ప్రారంభమయింది. వీర్రాజెంత వారించినా ప్రయోజనం లేక పోయింది.

వెంకన్న, పోలీసులు—బూడిదలో వెతకడం మొదలు పెట్టారు.

పర్సు ముందుగా దొరకలేదు. కానీ ఆ బూడిదలో వారికి పద్నాలుగు చిన్న చిన్న సంచులు దొరికాయి. అందులో పన్నెండు సంచులలో మాదక ద్రవ్యాలున్నాయి. రెండు సంచులలో వజ్రాలున్నాయి.

తర్వాత పర్సు కూడా దొరికింది.

పర్సులో ఆరువందల రూపాయలు మాత్రమే ఉన్నాయి.

పర్సును బూడిదలో వేయడం వెంకన్న పథకంలో ఒక భాగం. కనపడినా గమనించకుండా బూడిదను వెదికి ఆఖరున పర్సు తీయడం కూడా వెంకన్న పథకం.

అయితే బూడిదలో లక్షల విలువైన మాదక ద్రవ్యాలు, కోట్ల విలువ చేసే వజ్రాలు దొరుకుతాయని అతడు కూడా ఊహించలేదు.

"ఇలా జరుగుతుందని నా ఊహకందలేదు—" అన్నాడో పోలీసాఫీసరు.

"నా ఊహాకు అందలేదు, కానీ ఎలా జరిగిందో చెప్ప గలను...." అన్నాడు వెంకన్న.

కృష్ణమూర్తి మనిషిగా ఇటలీ వెళ్ళింది వైద్యానికి కాదు. శవంగా మారడానికి. వీర్రాజు గొడవలు రాకుండా ఉంటాయని కాదరబందీ లేని పేదవాడి నందు కెన్నుకున్నాడు. అతని కుటుంబాని కన్ని రక్షణలూ కలిగించాడు. తన సేవాసంస్థ ప్రచారం — సమాజంలో పెద్దమనిషన్న పేరు....

ఇటలీలో జరిగిన అపరేషను — మాదక ద్రవ్యాలు, వజ్రాలు — ఉన్న సంచుల్ని కృష్ణమూర్తి శరీరంలో ప్రవేశపెట్టడానికే! ఆ సంచులు ప్రత్యేకమైన ఫైర్ ప్రూఫ్ ప్లాస్టిక్‌తో తయారుచేయబడ్డాయి. అందుకే శవం కాలినా — ఆ సంచులు బూడిదలో మిగిలిపోయాయి. ఎంతో పకడ్బందీగా యెవరూ కనుక్కోలేని విధంగా స్మగ్లింగు గురించి వీర్రాజు వేసుకున్న పథకం చివరి క్షణాల్లో బెడిసి కొట్టింది.

వీర్రాజు వెంటనే కస్టడీలోకి తీసుకోబడ్డాడు. ఆ తర్వాత రమణ సేవాసంస్థ బండారమంతా బయట పడింది.

పోలీస్ కమీషనర్ స్వయంగా వెంకన్నను పిలిచి— "వెంకన్నగారూ! పోలీసు డిపార్టుమెంటుకు చెడ్డ పేరు రానివిధంగా అన్ని శ్రద్ధలూ తీసుకుని — ఓ పెద్ద స్మగ్లింగు ముఠాను పట్టిచ్చారు. మీ మేధాశక్తికి నా జోహార్లు—" అంటూ అభినందించాడు.

"ఇందులో నాదేమీ లేదు....ఒక డాక్టర్ తన వృత్తిపట్ల పాటించిన ధర్మం — ఇంతవు దారితీసింది...."

అన్నాడు వెంకన్న.

దేశంలో అవినీతి నశించాలంటే, దుర్మార్గాలు బయట పడాలంటే ప్రజలు నిజాయితీతో వృత్తిధర్మాల్ని పాటించాలి.

కానీ....

తమ సంరక్షణకై తామెనుకున్న ప్రజానాయకులే వృత్తిధర్మాన్ని పాటించనప్పుడు — దేశంలోని సేవా సంస్థలే — స్మగ్లింగుకు నిలయాలు కావడంలో ఆశ్చర్యమేముంది?

—: అ యి పో యి ం ది :—